# స్త్రీగా మారిన భంగాస్వనుడు

-ఇందిరా రమణ


భంగాస్యనుడనే రాజు సంతానము లేని కారణంగా ఒక యజ్ఞాన్ని వేసాడు. ఆయన ఆ యజ్ఞం వేయడం ఇంద్రుడికి ఇష్టం లేదు. యజ్ఞం ఫలితంగా ఆ రాజుకు నూరుగురు కుమారులు కలిగారు. ఆ సంతానంతో సంతోషంగా రాజ్య సుఖాలను అనుభవించాడు.

ఒకరోజు భంగాస్యనుడు వేటాడేందుకు అడవికెళ్ళాడు. ఇంద్రుడి కోపం ఫలితంగా భంగాస్యనుడు యెక్కిన రథానికున్న గుర్రాలు అతడిని కారడవిలో దూరంగా తీసుకుపోయాయి. కొంత దూరం వెళ్లిన తరువాత భంగాస్యనుడుకి దాహం వేసింది. మంచినీళ్ళ కోసం వెతుకుతూ మరికొంత దూరం వెళ్లాడు. సుదూరంగా కనిపించింది ఒక తామర కొలను. భంగాస్యనుడు కొలనులో నీటిని కడుపునిండా త్రాగి, కాళ్ళు చేతులు కడుక్కుని బయటకు వచ్చాడు. కొలనులో నీటిని తాగిన ఫలితంగా భంగాస్యనుడు ఆడపిల్లగా మారిపోయాడు. కంగారుగా అటు ఇటు తిరిగాడు. 'ఈ రూపంతో రాజ భవనానికి ఎలా వెళ్ళాలి? వెళ్ళకపోతే యెక్కడ ఉండాలి? అసలు ఈ రూపంతో రథాన్ని అధిరోహించగలనా? అంతఃపుర రాణులు నన్ను గురించి ఏమనుకుంటారు? పుత్రులు ఏమనుకుంటారో? అనుకుంటూ గత్యంతరం లేని పరిస్థితుల్లో స్త్రీ రూపంతోనే రాజధానికి వెళ్ళాడు.

స్త్రీ రూపంలో వున్న భంగాస్యనుని చూసి పౌరులు దూర దూరంగా తొలగిపోయారు. ఆ రాజు మంత్రులను అందరిని పిలిపించి అడవిలో జరిగినది యథాతథంగా వివరించాడు. స్త్రీ రూపంతో రాజ్యాన్ని పరిపాలించలేనని చెప్పి నూరుమంది పుత్రులలో జ్యేష్ఠుడికి పట్టాభిషేకం చేసాడు. అనంతరం అడవులకు వెళ్లి తపస్సు చేసుకుంటానని చెప్పి బయలుదేరాడు. స్త్రీ రూపంలో వున్న ఆ రాజును ఒక మునీశ్వరుడు ప్రేమిస్తాడు. వారి ప్రేమ ఫలితంగా వారిరువురికి మరో నూరు మంది పుత్రులు కలుగుతారు. పుత్రులందరిని తీసుకొని స్త్రీ రూపంలో వున్న భంగాస్యనుడు రాజధానికి చేరుకొన్నాడు. తన కుమారులందరిని పిలిచి నాయనా నేను పురుష రూపంలో వున్నప్పుడు మీరు జన్మించారు. స్త్రీ రూపంలో వున్నప్పుడు ఈ వందమంది కుమారులు జన్మించారు. వీరు మీ సోదరులు. కాబట్టి అంతా కలసిమెలసి సంతోషంగా రాజ్యపాలన చేస్తూ, నా సంపదను సమానంగా అనుభవించండి అని చెప్పాడు. అందుకు అతని కుమారులంతా అంగీకరించారు. ఇది చూసి దేవేంద్రుడు సహించలేకపోయాడు. ఏదైనా కీడు తలపెట్టాలని అనుకొన్నాడు. ఆ కుటుంబంలో కలతలు రేపటానికి కపట బ్రాహ్మణ వేషధారియై భంగాస్యనుడు పురుషుడుగా వున్నప్పుడు జన్మించిన పుత్రుల వద్దకు వెళ్ళి ''ఓ రాకుమారులారా యెవరి పుత్రులనో ఆదరించవలసిన అవసరం నీకేమున్నది? భంగాస్యనుడు స్త్రీ రూపంతో వున్నప్పుడు మీకు తండ్రి యెలా అవుతాడు'' అని అనేక విధాలుగా వారి మనస్సులో విషబీజాలు నాటాడు. భంగాస్యనుడు స్త్రీ రూపంలో వున్నప్పుడు జన్మించిన పుత్రుల వద్దకు వెళ్లి వారి మనస్సులో కూడా ద్వేషాగ్ని జ్వాలలు రేకెత్తించాడు. ఫలితంగా వారందరిలో మనస్పర్థలు ఏర్పడి కడకు కలహాలై, ఒకరితో ఒకరు పోరాడి చనిపోవడానికి కారణమయ్యారు. ఒక్క పుత్రుడు కూడా మిగలని కారణంగా భంగాస్యనుడు ఆక్రోశించాడు.

ఆ సమయంలో బ్రాహ్మణుని రూపంలో వున్న ఇంద్రుడు భంగాస్యనుని వద్దకు వచ్చి ఓదార్చాడు. భంగాస్యనుడు దుఃఖిస్తూ తన కథ అంతా అతనికి వివరంగా చెప్పాడు.

విప్రుని రూపంలో వున్న ఇంద్రుడు అతడిని చూసి జాలిపడి ఇట్లా అన్నాడు. ''నేను విప్రుడను కాను. ఇంద్రుడను. నాకు అయిష్టమైన క్రతువు నొకదానిని నీవు



నిర్వర్తించావు. దాని ఫలితంగానే నీకిన్ని కష్టాలు వాటిల్లాయి'' అని చెప్పాడు. భంగాస్యనుడు భయపడి ఇంద్రుని పాదాలపై పడి తన తప్పును మన్నించవలసిందిగా వేడుకున్నాడు.

జాలిపడిన ఇంద్రుడు ''భంగాస్యన నీ కుమారులలో కొందరిని బ్రతికిస్తాను. ఎవరు కావాలో కోరుకో అన్నాడు.

తాను స్త్రీ రూపంలో ఉన్నప్పుడు జన్మించిన కుమారులను బ్రతికించ వలసింది గా కోరుకున్నాడు భంగాస్యనుడు.

భంగాస్యనుడి కోరిక ఇంద్రునికి చాలా ఆశ్చర్యం కలిగించింది. పురుష రూపంలో వున్నప్పుడు జన్మించిన పుత్రులను కాకుండా స్త్రీ రూపంలో వున్నప్పుడు జన్మించిన పుత్రులను బ్రతికించవలసిందిగా కోరడానికి గల కారణమేమిటని భంగాస్యనుని ప్రశ్నించాడు ఇంద్రుడు. 'సంతానంపై తండ్రికన్నా తల్లికే ఎక్కువ మమకారం వుంటుంది. ప్రేమ అనురాగాలు వుంటాయి. కాబట్టి స్త్రీ రూపంలో వున్నప్పుడు నాకు జన్మించిన పుత్రులను బ్రతికించవలసిందిగా ప్రార్థిస్తున్నాను అన్నాడు.''

''భంగాస్యనుడు మాటలకు మహేంద్రుడు యెంతగానో సంతోషించాడు. అతడికి స్త్రీ పురుష రూపాల్లో జన్మించిన పుత్రులందరిని సజీవులను చేసాడు. భంగాస్యనునికి కూడా మునుపటి రూపాన్ని వరంగా ప్రసాదించాడు.

అయితే భంగాస్యనుడు తిరిగి పురుష రూపంలోకి మారేందుకు అంగీకరించలేదు. స్త్రీ రూపంలోనే వుండిపోతానన్నాడు.

భంగాస్యనుడి కోరిక మహేంద్రుడికి మరోసారి అమితాశ్చర్యాన్ని కలిగించింది.

''మహేంద్రా సంతానాన్ని కనడం ప్రేమాదరాభిమానాలతో వారిని పెంచడం ఉత్తములుగా వారిని తీర్చిదిద్దడం వంటి అనేక బాధ్యతల్లో పురుషుడి కన్నా స్త్రీకే ఎక్కువ ప్రాధాన్యత వున్నది. పిల్లల భవిష్యత్తును స్త్రీయే తీర్చిదిద్ద కలుగుతుంది. ఏ విధంగా చూసిన పురుషుల కన్నా స్త్రీలే గొప్పవారుగాను బాధ్యతలను నిర్వర్తించవలసిన వారుగాను కనిపిస్తున్నది. కాబట్టి నేను ఈ రూపంలోనే వుండాలని నిశ్చయించుకున్నాను'' అన్నాడు భంగాస్యనుడు.

# గ్రహజ్యోతి



16-3-92 నుంచి
23-3-92 వరకు

**మేషం:** విందు వినోదములు తిలకించుట, గృహోపకరణములు సమకూర్చుకొనుట సుభోజనం, మిత్రులయొక్క ఆదరణ, ధన లాభము, మనోసౌఖ్యం, ధైర్యము, ఇష్టస్త్రీ మృదుసంభాషణ. వృత్తి వ్యాపారములయందు అభివృద్ధి కల్గును.

**వృషభం:** అధికారుల అనుగ్రహం, పెద్దల ఆదరణ, గౌరవం లభించును. రచనల యందు ఉత్తర ప్రత్యుత్తరములయందు, మేలు కలుగను. వ్యవహారజయం, ఆర్థిక లాభాలు కల్గును. స్త్రీ సౌఖ్యము చేయు వృత్తి ఉద్యోగముల యందు అనుకూలత కలును.

**మిధునం:** నూతన వస్త్రలాభము, ప్రయత్న కార్యములయందు జయము పుణ్యకార్యముల యందు, ఆధ్యాత్మిక కార్యక్రమములందు మనస్సుని నిలుపుదురు. క్రయ విక్రయముల యందు అనుకూలత లభించును.

**కర్కాటకం:** బంధు మిత్రులతో అభిప్రాయ భేదములుండును. శత్రువులతో వాదనలు కల్గును. ప్రభుత్వ లావాదేవీలయందు మేలు కల్గును. ప్రయాణ సూచన కల్గును. కుటుంబములో శాంతి సౌఖ్యం ఏర్పడును. 8–15 తేదీలు అనుకూల దినాలు.

**సింహం:** ప్రయాణాలు అనుకూలించును. కోపం, విచారం, మనస్సులో చోటు చేసికొనును. వాణిజ్య వ్యాపారములయందు స్వల్ప ఇబ్బందులుండును. సాహస ప్రయత్నములకు కొంత ఆటంకం ఏర్పడును.

**కన్య:** ఈ వారంలో నూతన ప్రయత్నాలకు కొంత ఆటంకమేర్పడును. కష్టమధికం ఫలము స్వల్పంగా ఉండును. వ్యవహారచిక్కులు, ఋణదాతల వత్తిడి తగాదాలు కల్గును. కాంట్రాక్టులయందు, ప్రభుత్వ లావాదేవీల యందు స్తబ్దత ఏర్పడును.

**తుల:** ఈ వారంలో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడును. కుటుంబములో అశాంతి కల్గును. మిత్రులు సహకరింతురు. భూములయందు, వాహనములయందు ఇబ్బందులు ఏర్పడును. మీ ప్రయత్నములకు ఆటంకమేర్పడును. క్రీడలయందు, పరిశ్రమల యందు శ్రమ కల్గును.

**వృశ్చికం:** విద్వాంసులతో పరిచయం, కళారంగమందు, సినీ పరిశ్రమలయందు, టెలీ ఫిలింలు చేయువారికి అధిక అనుకూలత లభించును. నూతన వస్తు సేకరణ, మంచి ఆలోచనలు, మంచి భోజనం, సుగంధ ద్రవ్యప్రాప్తి సంతాన సుఖము కల్గును.

**ధనుస్సు:** స్వంత ఆలోచనలతో, స్వయం కృషితో చేయు కార్యక్రమములు సిద్ధించుట, కుటుంబవృద్ధి, మిత్రలాభం, వ్యవహారమందు జయం, కోర్టులయందు జయమును. పరిశ్రమలయందు అభివృద్ధి కలును.

**మకరం:** ఈ వారంలో ప్రేమితుల మూలామున, కళత్ర మూలమున సౌఖ్యము కీర్తి వస్త్రములు సేకరించుట సంతానానికి వృద్ధి కల్గును. వృత్తి ఉద్యోగ వ్యాపారములు మందకొడిగా సాగును.

**కుంభం:** అధికారులతోను, పెద్దలతోను, సంప్రదింపులు కల్గును. ప్రయాణములు అనుకూలత మేలుకల్గును. స్త్రీలవలన సుఖము, క్రయ విక్రయములయందు అనుకూలత కల్గును. దూరంనుంచి ఒక సమాచారం అందును. విద్యలయందు అభివృద్ధి, శరీర సుఖం కల్గును.

**మీనం:** ఈ వారంలో అవసరాలకు ధనము ప్రయాసమీద సమకూర్చుకొందురు. ఋణదాతల వత్తిడి, శత్రుబాధ కల్గును. ధన వ్యయం, కృష్యాది సర్వకార్యములయందు సామాన్య అనుకూలత కల్గును.

—పి.వి.యస్.రెడ్డి, ఇం.నెం. 24–381,
రంగారెడ్డినగర్, ఐ.డి.పి.యల్. కాలనీ,
హైదరాబాద్ –37